# ప్రజాశక్తి

గురువారం 27 జులై 2023 | 5 | విజయనగరం

## జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనల మేరకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాల -2024 కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాలలో ప్రత్యేక ప్రతిభ కనబర్చిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 18 సంవత్సరాల లోపు బాల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా క్రీడలు, సామజిక సేవా రంగం, ధైర్య సాహసాలు, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ , సాంస్కృతిక సంప్రదాయాలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలు తదితర రంగాలలో ప్రతిభ కనబర్చిన బాలలు ఆగస్టు 31 లోగా http://awards.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని తెలిపారు.

విజయనగరంలో కురుస్తున్న భారీ వర్షం

# ఎడతెరిపిలేని వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విజయనగరంలో కుండపోత
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- పర్యవేక్షణకు కంట్రోల్ రూములు
- అత్యధికంగా చీపురుపల్లిలో 64.7మి.మీ.వర్షపాతం నమోదు

ప్రజాశకి-విజయనగరం

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా అంతటా గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం విజయనగరంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో ఎడతెరిపి లేని వర్షం కురిసింది. వర్షాలతో బొబ్బిలి మండలం అలజంగి వద్ద తోటపల్లి కాలువకు గండిపడింది. గతనెలలో అదేచోట కాలువకు గండిపడగా, నీటిపారుదలశాఖ అధికారులు తూతూమంత్రంగా పనులు చేపట్టారు. ఈనేపథ్యంలో మళ్లీ గండిపడింది. విజయనగరంలో ఎడతెరిపి లేని వర్షంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భగవాన్‌నగర్, పిడబ్ల్యు మార్కెట్, మున్సిపల్ మార్కెట్, రాజీవ్‌నగర్ కాలనీ, రామకృష్ణానగర్, తోటపాలెంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కాలువలు పొంగి రహదారులపై ప్రవహించాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం 36.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా చీపురుపల్లి మండలంలో 64.7 మి.మీ, గరివిడి మండలంలో 59.8మి.మీ, అత్యల్పంగా వంగర మండలంలో 10.6 మి.మీ. వర్షం కురిసింది. పూసపాటిరేగ మండలం కొప్పెర్ల,పాత కొప్పెర్ల, కొత్తవలస మండలం తుమ్మికాలప్లిలో భారీ వర్షం కురిసింది.

వర్షాలతో మరోవైపు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వరినారు వేసిన రైతులు ..చెరువులన్నీ నిండిపోవడంతో ఉబాలు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

**అధికార యంత్రాంగం అప్రమత్తం**

జిల్లాలో గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వర్షాల కారణంగా ఏదైనా ప్రమాదాలు సంభవించినా, అత్యవసర సహాయం అందించాల్సి వచ్చినా సహాయ చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాల వల్ల ఎవరికైనా సహాయం అవసరమైతే కలెక్టర్ కార్యాలయం లోని కంట్రోల్ రూం నెంబరు 08922-236947 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. వర్షాల కారణంగా చెరువులు గండిపడటం, రోడ్లు తెగిపోవడం వంటి ఘటనలపై సమాచారాన్ని కూడా కంట్రోల్ రూముకు తెలిపాలని కోరారు. జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లోనూ కంట్రోల్‌రూంలు తెరిచినట్లు పేర్కొన్నారు.

| మండలం | నమోదైన వర్షపాతం |
|---|---|
| వంగర | 10.6 |
| రేగిడి | 17.7 |
| సంతకవిటి | 32.7 |
| రాజాం | 20.6 |
| బొబ్బిలి | 13.0 |
| రామభద్రపురం | 13.8 |
| బాడంగి | 31.4 |
| తెర్లాం | 22.2 |
| మెరకముడిదాం | 35.0 |
| దత్తిరాజేరు | 44.9 |
| మెంటాడ | 25.5 |
| గజపతినగరం | 37.4 |
| గరివిడి | 59.8 |
| చీపురుపల్లి | 64.7 |
| గుర్ల | 55.4 |
| బొండపల్లి | 30.8 |
| గంట్యాడ | 27.6 |
| శృంగవరపుకోట | 27.6 |
| వేపాడ | 39.1 |
| లక్కవరపుకోట | 33.4 |
| కొత్తవలస | 42.0 |
| జామి | 47.4 |
| విజయనగరం | 50.2 |
| నెల్లిమర్ల | 54.0 |
| పూసపాటిరేగ | 44.7 |
| డెంకాడ | 36.6 |
| భోగాపురం | 58.6 |
| **మొత్తం** | **36.3** |

## తోటపల్లి కాలువకు మళ్లీ గండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని అలజంగి వద్ద తోటపల్లి కుడి కాలువకు బుధవారం గండి పడింది. గత నెలలో కూడా ఇదే కాలువకు గండి పడడంతో అప్పటికప్పుడు నీటిపారుదల అధికారులు తాత్కాలికంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. గత మూడు రోజుల నుండి వర్షాలు పడుతుండడంతో మళ్లీ అదేచోట కాలువకు గండిపడింది. దీంతో నీరు వృథాగా పోవడమే కాకుండా దిగువన గల పొలాలన్నీ ముంపునకు గురయ్యాయి.

**పరిశీలించిన ఎమ్మెల్యే**

కాలువకు గండి పడిన చోటును ఎమ్మెల్యే ఎస్‌విసి హెచ్ అప్పలనాయుడు పరిశీలించి వెంటనే గండి పుడ్చే పని త్వరితగతిన పూర్తి చెయ్యాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు.

కాలువకు గండిపడడంతో వృథాగా పోతున్న నీరు

ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన దీక్ష చేస్తున్న సిపిఎం నాయకులు

## మణిపూర్‌లో శాంతి భద్రతలను పరిరక్షించాలి

### మారణ హోమానికి కేంద్రమే బాధ్యత వహించాలి : తమ్మినేని

### సిపిఎం ఆధ్వర్యాన నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత మూడునెలలుగా మణిపూర్‌లో మారణకాండ జరుగుతుంటే శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రధాని మోడీ మౌనం వహించడం దుర్మార్గమని, వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి శాంతిని పునరుద్ధరించే ప్రయత్నం చేయాలని అన్నారు. మణిపూర్ మారణకాండ కు నిరసనగా బుధవారం సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రెండు గిరిజన తెగల మధ్య జరుగుతున్న అల్లర్లలో మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో గనులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు జరుగుతున్న ఈ కుట్రను ప్రజలంతా ఖండించాలని, సిపిఎం చేస్తున్న పోరాటానికి ప్రజలంతా మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాలు ప్రధానమంత్రి స్పందించాలని కోరినా పార్లమెంట్ లో మాట్లాడేందుకు మోడీ ముందుకు రాకపోవడం అన్యాయమన్నారు. మోడీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వెంటనే మణిపూర్‌లో ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్ మోహన్, నగర నాయకులు, బి. రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి యుఎస్ రవి కుమార్, విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు..

## 27,28 తేదీల్లో నీటి సరఫరా బంద్

**విజయనగరం టౌన్ :** తాటిపూడి గ్రావిటీ పైప్ లైన్ వద్ద లీకేజీల మరమ్మతుల కారణంగా ఈనెల 27,28 తేదీల్లో 17 నుండి 47 డివిజన్ల పరిధిలో నీటి పంపిణీ అంతరాయం ఏర్పడుతుందని నీటి సరఫరా విభాగం ఇఇ కె.శ్రీనివాసరావు తెలిపారు. 29వ తేదీ నుండి యధావిధిగా ఆయా డివిజన్లకు నీటి పంపిణీ జరుగుతుందని తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

## కోలుకునే వరకు వైద్యసేవలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -వంగర

మండలంలోని మడ్డువలసలోగల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడే వరకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తామని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్ . భాస్కరరావు తెలిపారు. బుధవారం గురుకులానికి చేరుకొని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సుష్మత దయానా, జ్యోతి, ఈశ్వరరావు , విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సమన్వయకర్తలు (డిసిఒలు) తోట పద్మజ, బాలాజీ నాయక్, ఇంచార్జి ప్రిన్సిపాల్ జి. సూర్యకుమారితో సమీక్ష నిర్వహించారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కోలుకునేంతవరకు వైద్య సేవలు అందించాలని వైద్యులకు ఆదేశించారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. విద్యార్థినులతో కాసేపు మాట్లాడి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బయట నుంచి తల్లిదండ్రులు తెచ్చిన కలుషిత ఆహారం తినటం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తుందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి బాగానే ఉందన్నారు. అంతకుముందు చీపురుపల్లి ఆర్‌డిఒ ఎం. అప్పారావు వంగర తహశీల్దార్ తో కలిసి గురుకులాన్ని సందర్శించారు.

**భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు : ఎమ్మెల్యే**

గురుకులంలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనములో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరవల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, తహశీల్దార్ డి. ఐజాక్, ఎంఇఒ వై దుర్గారావు, కనగల పారినాయుడు, పోలిరెడ్డి రమేష్, గేదెల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గుర్లలో కృషి విజ్ఞాన కేంద్రం

- ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధంగా ఉంచాలి
- 115 పిఎం కిసాన్ సంవృద్ధి కేంద్రాల ఏర్పాటు
- 50 శాతం సబ్సిడీపై రాగి విత్తనాలు
- జిల్లా వ్యవసాయ సలహా మండలి నిర్ణయాలు

సాగు పద్ధతులపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పి ఛైర్మన్, కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు జిల్లా వ్యవసాయ సలహా మండలి సూత్రప్రాయంగా నిర్ణయించింది. జిల్లాలో వర్షాలు విస్తతంగా పడుతున్నాయని, వాతావరణ పరిస్థితి ఖరీఫ్‌కు అనుకూలంగా మారినందున, అవసరమైన ఎరువులను సిద్ధం చేయాలని కోరింది. జిల్లాలో అర్హత ఉన్న కౌలుదారులందరికీ గుర్తింపు కార్డులను మంజూరు చేసి, సహకార బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని నిర్ణయించింది. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఛైర్మన్ గేదెల వెంకటేశ్వర్రావు అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. వ్యవసాయం, ఉద్యాన, పశు సంవర్ధక, నీటిపారుదల శాఖలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

జిల్లాకు మంజూరైన కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎస్ఎస్ఆర్ పేటలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు తెలిపారు. కెవికె ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సరిపడా భూమి అందుబాటులో లేని పక్షంలో, చీపురుపల్లి మండలంలో ఏర్పాటు చేయాలని జెడ్‌పి ఛైర్మన్ సూచించారు. . జిల్లాలో రాగి పంటకు విస్తృత ప్రచారం కల్పించాలని జెడ్‌పి ఛైర్మన్ కోరారు. నీటిపారుదల శాఖాధికారుల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా గండ్లు పడితే పూడ్చేందుకు తగిన ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఆన్‌లైన్ ద్వారా ఇకెవైసి చేసుకొనే అవకాశం ఉందని, విస్తత ప్రచారం చేయడం ద్వారా ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. ఇకెవైసి చేయించుకొనేందుకు ఈ నెలాఖరు వరకు సమయం ఉందని, ఇదే చివరి అవకాశమని చెప్పారు. ఇకెవైసి చేయించుకున్న వారికి మాత్రమే పిఎం కిసాన్ వర్తిస్తుందని స్పష్టం చేశారు.

వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ, ఏ రకమైన ధాన్యాన్నయినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న భరోసా రైతులకు కల్పించాలని సూచించారు. భూసార పరీక్షలను నిర్వహించి, ఆయా భూములకు తగిన ఎరువులను సూచించాలని కోరారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న వేసినప్పుడు, నీరు నిలువ ఉన్నచోట పంట రంగుమారి, సమస్య వస్తోందని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు దీనికి తగిన పరిష్కారాన్ని రైతులకు తెలియజేయాలని కోరారు. వ్యవసాయశాఖ అజెండాను, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు వివరించారు. జిల్లాలో 50 శాతం సబ్సిడీపై రాగి విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన 115 ఎరువుల షాపుల్లో పిఎం కిసాన్ సంవృద్ధి కేంద్రాలను గురువారం ప్రధానమంత్రి వర్చువల్‌లో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం చిరుధాన్యాల సాగు పద్ధతులు, ఉపయోగాలపై వ్యవసాయ శాఖ ప్రచురించిన పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు వాసుదేవరావు, వెంకటేశ్వర్రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతి ర్యాలీ చేస్తున్న పలు సంఘాల కార్యకర్తలు

## ప్రజాసంఘాల ఆధ్వర్యాన శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మణిపూర్‌లో జరుగతున్న దారుణాలను నిరసిస్తూ దళిత గిరిజన బహుజన మైనార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోట జంక్షన్ నుంచి ప్రారంభమై మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా అంబేద్కర్ జంక్షన్ వద్దకు చేరుకుంది. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో మానవ హక్కులు ప్రశ్నార్ధకమవుతున్నాయని, మానవత్వం నశించిపోతున్నదని మణిపూర్ సంఘటన తేటతెల్లం చేస్తుందని అన్నారు. మణిపూర్ సంఘటనలకు కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని శాంతిభద్రతలను పరిరక్షించి పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎపి పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలజంగి రవికుమార్, జమాతే ఇస్లామీ హింద్ ప్రెసిడెంట్ మహమ్మద్ హబీబ్, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బుంగ బాను మూర్తి . గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మి అప్పలరాజు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు చెలికి లక్ష్మణ్ , క్రైస్తవ స్త్రీల సమాఖ్య జిల్లా ప్రతినిధి సొరకాయల నిర్మలమ్మ డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.వరలక్ష్మి దళిత బహుజన శ్రామిక యూనియన్ శ్రీ మహిళా విభాగం కన్వీనర్ చెలికి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో భవనాలను పూర్తి చేయాలి

### పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్‌బికెలు కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-మెంటాడ,గజపతినగరం

నాడు-నేడు కిందచేపడుతున్న పాఠశాల భవనాలను, రైతు భరోసాకేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం మెంటాడ, గజపతినగరం మండలాల్లో ఆమె పర్యటించారు. మెంటాడలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసారు. ఫ్యామిలీ ఫ్జిజిషియన్ బృందం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి బరువు తక్కువ ఉన్నవారిని తనిఖీ చేయాలని వైద్యాధికారికి ఆదేశించారు. గర్భిణీలకు రక్త పరిక్షలు నిర్వహిస్తున్నదీ లేనిదీ ఆరా తీసారు. స్టాక్ రూమ్ లో నున్న గుడ్లు, పాలు ఇతర సామగ్రిని తనిఖీ చేసారు. అనంతరం కె.జి.బి.వి పాఠశాలను సందర్శించారు. నాడు-నేడు పనులను, టాయిలెట్‌లను, కిచెన్, మెనూ తనిఖీ చేసారు. డ్రాపౌట్స్ ఎంత మందిని జాయిన్ చేసారని ఎంఇఒను ప్రశ్నించారు. 10 వ తరగతి క్లాసు రూమ్ ను సందర్శించి పిలలతో లెక్కలు చేయించారు. చదువులో వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేసి రీ సర్వే ప్రక్రియ పై ఆరా తీసారు. జయతి ఆర్‌బికె ను సందర్శించారు. ఆర్‌బికె వెల్నెస్ సెంటర్ల నిర్మాణాల పురోగతిపై ఇంజనీరింగ్ అసిస్టెంట్ ను ప్రశ్నించారు.

విద్యార్థులతో హిందీ పాఠాన్ని చదివిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గజపతినగరం మండలం గంగచోళ్ల పెంట జెడ్‌పి హైస్కూలులో జరుగుతున్న నాడు- నేడు పనులను తనిఖీ చేసారు. వాలంటీర్ సర్వే యాప్ లో నమోదైన డ్రాప్ ఔట్ల నందరిని జాయిన్ చేసారా అని ఎంఇఒను ప్రశ్నించారు. 10 వ తరగతి క్లాసు రూమ్ ను సందర్శించి పిల్లలతో హిందీ పాఠాన్ని చదివించి అర్ధాన్ని చెప్పమన్నారు. పురిటిపెంటలో నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనాన్ని సందర్శించారు. చిన్న చిన్న పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభించాలని, వెంటనే హ్యాండ్ ఓవర్ చేయాలనీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సచివాలయానికి ప్రహరి గోడ లేదని గ్రామస్తులు అడుగగా ప్రతిపాదనలు పంపాలని ఎంపిడిఒకు సూచించారు. అనంతరం ఎం.ఆర్.ఓ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్ అరుణ కుమారితో మాట్లాడి రీ సర్వే పై ఆరా తీసారు. సురక్ష , గడప గడపకు జరుగుతున్న తీరు పై ఎంపిడిఒను ప్రశ్నించారు. కలెక్టర్ వెంట బొబ్బిలి ఆర్‌డిఒ శేష శైలజ , మెంటాడ తహశీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ త్రివిక్రమ రావు, సచివాలయాల సమన్వయ కర్త నిర్మలా దేవి, హౌసింగ్ డిఇలు పాల్గొన్నారు.

## 28న ఆర్థిక కార్యాలయాల సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యాలయాల సముదాయాన్ని (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్) రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 28న ప్రారంభించనున్నట్లు జిల్లా ఖజానా అధికారి ఆర్ఎఎస్ కుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధ్యక్షత వహిస్తారని, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఖజానా శాఖ డైరక్టర్ ఎస్.మోహనరావు పాల్గొంటారని తెలిపారు. రూ.14.30 కోట్ల వ్యయంతో మూడు అంతస్థుల్లో నిర్మించిన ఈ భవన సముదాయంలో జిల్లా ఖజానా అధికారి కార్యాలయంతో పాటు, పే అండ్ అకౌంట్స్ కార్యాలయం, ప్రభుత్వ బీమా కార్యాలయం, జిల్లా ఆడిట్ అధికారి(స్టేట్ ఆడిట్) కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## జలమయం కాకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారీగా నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాలను బుధవారం సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన నిలిచిన నీటికి అడ్డంకులను తొలగించి ప్రవహించే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే చుట్టుపక్కల ప్రాంతాల స్థానికులకు తగు సూచనలు చేశారు. ఖాళీ ప్రదేశాలలో ఏర్పడ్డ గుంతలు, గోతులను ఎప్పటికప్పుడు పూడ్చుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులకు, వైద్య సిబ్బందికి, సచివాలయ కార్యదర్శులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశించారు. వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫీవర్ సర్వే ఏ విధంగా జరుగుతోంది, దోమల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేమిటి, రోజువారి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుంది, వర్షాలు కురిసిన అనంతరం తీసుకుంటున్న పరిశుభ్రత చర్యలు గూర్చి పారిశుధ్య పర్యవేక్షకులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసిన నాడే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. నీరు నిల్వ లేకుండా వృథా సామాన్లను ఎప్పటికప్పుడు తొలగించిలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. దోమల వృద్ధిని నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఆయిల్ బాల్స్ ను కుంటలలో, చెరువులలో విరివిగా వేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రజా అవగాహన పెంచేందుకు విరివిగా వైద్య శిబిరాలు నిర్వహిస్తే మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, ఎఎన్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భగవాన్‌నగర్ ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్నకోలగట్ల

**ముంపు ప్రాంతాన్ని పరిశీలించినకోలగట్ల**

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని భగవాన్ నగర్ వద్ద పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంతాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి బుధవారం మధ్యాహ్నం పరిశీలించారు. జోరు వానలోను ఆయన పర్యటించారు. నీరు నిల్వ లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్పష్టం చేశారు.

**పిచికారీ యంత్రాలు అందజేత**

దోమల నియంత్రణకు ఉపయోగపడే పిచికారి యంత్రాలను ప్రజారోగ్య సిబ్బందికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అందజేశారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి డా.కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు అధికంగా వృద్ధి చెందుతాయని, వీటి నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

## పంటలను ధ్వంసం చేసిన గజరాజులు

**వంగర:** మండలంలోకి చేరుకున్న గజరాజుల గుంపు పలు గ్రామాల్లో పొలాలలో సంచరించి నారుమడులు, చెరకు మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. గజరాజులు గుంపు ప్రస్తుతం మద్దువలస ప్రాంతం నుంచి సంగాం గ్రామ పొలాలలోకి చేరుకున్నాయి. అటవీ శాఖ అధికారులు గజరాజుల కదలికలను పరిశీలిస్తున్నారు. తహశీల్దార్ డి ఐజాక్, ఎస్సై ఆర్ జనార్దన్ రావు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి : పిఆర్ డిఇ

**బొబ్బిలిరూరల్:** మండలంలోని సచివాలయాలు, ఆర్‌బికెలు, హెల్త్ సెంటర్ల సెప్టెంబర్ నాటికి పూర్తి చెయ్యాలని పిఆర్ డిఇ అప్పారావు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. బుధవారం పిఆర్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పనులు పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించామన్నారు. మిగతా పనులు పూర్తయిన వెంటనే చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్ పాల్గొన్నారు.

## స్వచ్ఛసర్వేక్షన్ కేలండర్ విడుదల

**బొబ్బిలి రూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ సర్వేక్షన్ కేలండర్‌ను ఎంపిడిఒ, తహశీల్దార్లు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు పడుతున్న దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రవణ్ కుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యుపిసి పరిశీలన

**వేపాడ :** మండలంలోని కెజేపూడి గ్రామంలో గల ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను ఎంపిడిఒ బివికెసన్ పట్నాయక్ బుధవారం పరిశీలించారు. గ్రామస్థులందరూ తప్పనిసరిగా ఎస్‌డబ్ల్యుపి షెడ్‌ను వినియోగించుకోవాలన్నారు. దీని వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

## శిక్షణ తరగతులను సందర్శించిన డిఇఒ

**కొత్తవలస:** కొత్తవలస, వియ్యంపేట, కంటకాపల్లి స్కూల్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ప్రాథమిక స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల నుండి ఫీడ్ బ్యాక్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో 50శాతం బ్యాక్ వర్డు ఉండటం, దాన్ని అధిగమించడానికి కృషి చేయాలని సూచించారు. తన పర్యవేక్షణలో విద్యార్థుల సాధన పుస్తకాలు సరిగా కరెక్షన్ చేయకపోవడం గుర్తించామన్నారు. ఉపాధ్యాయులు పాఠం పూర్తి చేసిన తరువాత విద్యార్థులచే సాధన పుస్తకాలు పూర్తి చేయించాలని, సాధన పుస్తకాలు పూర్తి చేయడంలో సహాయం అవసరమైన విద్యార్థులకు ఉపాధ్యాయులు సహాయం అందివ్వాలని సూచించారు. అనంతరం కొత్తవలస మండలం గాంధీ పాఠశాలలో తనిఖీలు చేశారు.

## చంద్రబాబును కలిసిన ‘కంది’

**డెంకాడ:** టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ పరిస్థితి గురించి చంద్రబాబు అడిగి తెలుసుకున్నట్లు కంది తెలిపారు. అనంతరం పాదయాత్ర చేస్తున్న లోకేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు.

## 11 రకాల ధ్రువ పత్రాలు పంపిణీ

**రేగిడి:** మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జగనన్న సురక్ష పథకంలో భాగంగా సర్పంచ్, వైసిపి నాయకులు కెంబూరు తేజ వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ నాగమణి 11 రకాల ఉచిత ధ్రువీకరణ పత్రాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం శ్రీరామరక్ష అన్నారు. అర్హులైన వారందరికీ ఉచిత ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యాలయాలు చుట్టూ తిరగకుండా అర్హులకి ధ్రువీకరణ పత్రాలు అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంకిలి సొసైటీ మాజీ అధ్యక్షులు అప్పలనాయుడు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు ఉన్నారు.

## వికలాంగులకు గొడుగులు వితరణ

**బాడంగి:** స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న 25మంది వికలాంగ విద్యార్థులకు, 10మంది అమ్మ, నాన్న లేని అనాథ విద్యార్థులకు సాలూరు మండలం బాగువలస గ్రామానికి చెందిన ఎల్‌ఐసి ఏజెంట్ బొంగు స్వామినాయుడు బుధవారం గొడుగుల వితరణగా అందించారు. పాఠశాలలో వికలాంగులకు అందుతున్న సేవలను సామాజిక మద్యమాలు ద్వారా తెలుసుకొని తన వంతు సాయంగా రూ.5వేల విలువగల గొడుగులను హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ వికలాంగుల కోసం ఎంతో మంది దాతలు ముందుకు వస్తున్నారని వితరణ చేసిన స్వామినాయుడుకి, ఎంతో మంది దాతలు వికలాంగులకు వితరణ చేయటానికి కారణమైన ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐఎస్‌వి ప్రసాద్, సబ్బాన సత్యనారాయణ, యు.రామారావు, పాల్గొన్నారు.

## గ్రామస్తుల దాహార్తి తీర్చిన బేబినాయన

**బాడంగి:** బాడంగిలో గత నాలుగు రోజులుగా తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ కండి రమేష్ టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి బేబినాయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన బుధవారం రెండు తాగునీటి ట్యాంకర్లను గ్రామానికి పంపించి ప్రజల దాహార్తిని తీర్చారు పైపు లైన్ల మరమ్మతులు పనులు జరుగుతున్న కారణంగా గ్రామానికి తాగునీటి సమస్య వచ్చిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాస్ ఉన్నారు.

## పన్నుల వసూళ్లు వేగవంతం

**బొబ్బిలి:** మున్సిపాలిటీలో ఆస్తిపన్ను, నీటిపన్ను, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపులు అద్దె వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ రెవెన్యూ వసూళ్లపై మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తిపన్ను, నీటిపన్ను, అద్దెలు వసూళ్లు వేగవంతం చేసేందుకు ప్రతి సచివాలయం పరిధిలో పని చేయాలన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో బకాయి అద్దె వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖాళీగా ఉన్న షాపులపై రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఖాళీ షాపులకు టెండర్లు పిలిచి అద్దెకు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఒ ప్రసాద్, ఆర్ఐ సురాప్, పాల్గొన్నారు.

## విద్యార్థుల ద్రోహి జగన్మోహన్ రెడ్డి

**శృంగవరపు కోట:** విద్యార్థుల ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని విశాఖ పార్లమెంట్ టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు ఎస్.రతన్ కాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు డెక్క ఈశ్వరరావు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు వాకాడ బాలు ఈశ్వర్ అధ్యక్షతన అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన బకాయలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులతో కలిసి బుధవారం దుర్గాదేవి గుడి జంక్షన్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్ రోడ్‌లో ర్యాలీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, నాయకులు వాకడ బాలేశ్వర్, గుమ్మడి గణేష్, గొరి పుట్టి సంజీవ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## 28న మండల సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 28న ఎంపిపి డి సత్యవంతుడు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపిడిఒ పట్నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులు కూడా హాజరు కావాలన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు మాత్రమే సమావేశానికి హాజరు కావాలని చెప్పారు.

## పతివాడలో మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని పతివాడలో బుధవారం రూ. 5 లక్షలతో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను ఎంపిటిసి పతివాడ అప్పలనాయుడు ప్రారంబించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పతివాడలో రెడ్డిక వీది, గొల్లపేటలో తాగునీటి సమస్య ఉందన్నారు. గ్రామ మంతటికి పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఓవర్ హెడ్ ట్యాక్ ద్వారా సరఫరా అవుతున్న నీరు ఎగువ వీదులైన రెడ్డిక వీది, గొల్లపేటలో తాగునీరు ఇబ్బంది అవుతుందన్నారు. దాంతో ఆ వీదుల్లో ప్రజల కోసం ప్రత్యేకంగా మినీ ట్యాంక్ ఏర్పాటు చేసామన్నారు. ఈ ట్యాకు ఏర్పాటుకు మండల పరిషత్ నిధులు వినియోగించినట్లు తెలిపారు. ఆయనతో పాటు వైస్ ఎంపిపి ఎన్. సత్యనారాయణ రాజు, మండల జెసిఎస్ కన్వినర్ మహంతి శ్రీనువాసరావు, సర్పంచ్ ఆకుల పైడిరాము, నాయకులు నారాయణ రావు, పండోడు, పతివాడ సూరిబాబు, ఎంపిడిఒ జి. రామారావు, పంచాయతీ అధికారి శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

# యుసిసి బిల్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టే యుసిసి బిల్లును రద్దు చేయాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. యుసిసి బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు మాట్లాడుతూ దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ యుసిసి బిల్లు తీసుకువస్తున్నట్లు చెప్పారు. లౌకిక భారతదేశంలో విభిన్న మతాలు, జాతులు ఉన్నారని, లౌకిక హక్కులకు భంగం కలిగేలా యుసిసి బిల్లు తేవడం అన్యాయమని అన్నారు. బిజెపి విధానాలతో దేశంలో ఆర్థిక అసమానతలను పెరుగుతున్నాయని, ఆర్థిక అసమానతలు తొలగించకుండా యుసిసి బిల్లు తీసుకురావడం దుర్మార్గమన్నారు. అన్ని మతాల, జాతుల ఆచారాలను గౌరవించాలని కోరారు. దేశంలో పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, గూడు, కూడు సౌఖ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మైనారిటీ సంఘం నాయలులు జాఫర్, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు జయరాజ్ మాట్లాడుతూ సివిల్ కోడ్ అమలు చేసి దేశ లౌకిక వాదానికి తూట్లు పొడవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. విభిన్న జాతులు, మతాలు నివసిస్తున్న భారతదేశాన్ని హిందు దేశంగా మార్చివేసేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తున్నాయన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శంకరరావు

సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కులమతాలకు అతీతంగా పోరాటం చేసి స్వాతంత్ర్యం సాధిస్తే నేడు కుల, మత విభేదాలను రెచ్చగొట్టి ప్రజలను బిజెపి ప్రభుత్వం విభజిస్తుందని చెప్పారు. రాజకీయ లబ్ది కోసమే సివిల్ కోడ్ తీసుకురావాలని మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా యుసిసి బిల్లు తీసుకురావడం అన్యాయమన్నారు. హామీలను అమలు చేయాలని, యుసిసి బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విభిన్న జాతులు, సంస్కృతి సంప్రదాయాలు ఉన్న దేశంలో యుసిసి బిల్లు దుర్మార్గమన్నారు. పికెఎస్ నాయకులు టి.అప్పలనాయుడు మాట్లాడుతూ నోట్లు రద్దు, జిఎస్‌టితో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడుతున్న పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వాసు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బొద్దాం పాఠశాల పరిశీలన

**వేపాడ:** మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎంఇఒ పి. బాలబాస్కరరావు బుధవారం పరిశీలించారు. హిందీ సబ్జెక్టు పై విద్యార్థులను ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించి పాఠశాలకు మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం పిహెచ్‌సి పరిధిలోని బొద్దాం గ్రామంలో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి రమాదేవి తెలిపారు. అనంతరం రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ఎంపిడిఒ పట్నాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ఓట్ల తనిఖీపై ముందే సమాచారమివ్వాలి

ప్రజాశక్తి- విజయనగరం

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న ఓటర్ల ఇంటింటి తనిఖీ కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ఇఆర్‌ఓలను ఆదేశించారు. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులతో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ బుధవారం తన ఛాంబరులో సమీక్షించారు. బూత్ స్థాయి అధికారులు తమకు నిర్దేశించిన మేరకు ప్రతిరోజూ ఆయా ఇళ్ల సందర్శనను పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల సమాచారం కోసం ఇళ్లకు వెళ్లడానికి ఒకరోజు ముందుగానే వారికి ఆయా ఇళ్ల తనిఖీకి వస్తున్న సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల తనిఖీ కార్యక్రమంలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లను కూడా భాగస్వాములను చేస్తున్నందున వారితో సమన్వయం చేసుకొని ఆయా వార్డుల్లో తనిఖీలు చేపట్టేటపుడు సంబంధిత షెడ్యూలును రాజకీయ పార్టీల ఏజెంట్లకు ముందుగా తెలియజేయాలన్నారు. బూత్ స్థాయి అధికారి ప్రతిరోజూ ఎన్ని గృహాలను సందర్శించినదీ రోజువారీగా సమాచారం సేకరించాలన్నారు. గృహాల సందర్శనలో బిఎల్‌ఓలతో పాటు రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఐవిపి రాజు, వైసిపి నాయకులు రొంగలి పోతన, కాంగ్రెస్ నాయకులు సతీష్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణ, సుదర్శన దొర, నూకరాజు, పద్మలత, ఎన్నికల సూపరింటెండెంట్ దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలిరూరల్ :** ప్రతి ఒక్క బిఎల్ఒ ఓటర్ల పరిశీలనలో జాగ్రత్తగా వుండాలని తహశీల్దార్ డి. రాజేశ్వర్రావు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన వారి పేర్లు తొలగించడం, శాశ్వత వలసలు పోయిన వారిని తొలగించడంలో సంబంధిత కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేసి తొలగించాలన్నారు. కుటుంబ సభ్యుల అందరి ఓట్లు ఒకే పిఎస్‌లో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఒకే డోర్ పై ఎక్కువ ఓట్లు ఉంటే జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. సున్నా డోర్ నెంబర్ లేకుండా నమోదు చెయ్యాలన్నారు. రాజకీయ పార్టీల తరుపున వారి ప్రతినిధులను తీసుకువెళ్లాలని వారు అభ్యంతరాలు తెలియజేస్తే పరిశీలించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిటి శ్రీనివాశరావు, బియల్‌ఒలు పాల్గొన్నారు.

# స్పందించకపోవడంతోనే సమ్మె

ప్రజాశక్తి - రామభద్రపురం



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

స్థానిక మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు గత 24 రోజులుగా చేస్తున్న సమ్మెకు ముందు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు, సమ్మె నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందన లేక తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగారని సిఐటియు నేతలు శంకరరావు, బలసా శ్రీను తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరవదిక సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సంఘీ భావం ప్రకటించారు. అనంతరం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఇటీవల పంచాయతీ పాలక వర్గం ఈ సమ్మెపై ఈవోకి ఫిర్యాదు చేస్తూ కార్మికులును తొలగిస్తున్నట్లు, గ్రామంలో అనారోగ్య పరిస్థితులకు వీరే కారణమని, పనులు చేయడం లేదని, చర్చలకు రావడం లేదని ఫిర్యాదు చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సమ్మెకు పూర్తి భాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమేనని ఇప్పుడు గ్రామంలో ప్రజా రోగ్య పరిస్థితులు బాగోలేకపోవడానికి మీరే కారణం తప్ప కార్మికులు కాదనీ ఇప్పటికైనా చర్చలు జరిపి సమస్య పరిష్కరించుకునేందుకు పిలిస్తే రావడానికి కార్మికులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ పరమేష్, భవాని కార్మికులు పాల్గొన్నారు.

## మిగులు సీట్లుకు దరఖాస్తులు ఆహ్వానం

**బాడంగి:** స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామదాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 22, 6వ తరగతిలో 10, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో 9, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి 19, బైపిసిలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరాలంటే పదో తరగతి మార్చిలో పాస్ అయి వుండాలన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

## అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లిలో పట్టణంలోని రుంకాన వీధిలో మూడు నెలల క్రితం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి నాలుగు పురి ఇల్లులు పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. నాలుగు కుటుంబాలకు అండగా నిలవాలని ధీరా ఫౌండేషన్ ద్వారా విజయనగరం మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మీ చేతుల మీదుగా బుధవారం ప్రతి కుటుంబానికి రూ.5వేలు చొప్పున నగదు, నెలకు సరిపడా నిత్యావసరాలు, బట్టలు అందించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గరివిడి క్యాంప్ కార్యాలయం జరిగిన ఈ కార్యక్రమంలో బాధితులు రుంకాన కళావతి, రుంకాన అన్నపూర్ణ, రుంకాన బంగారమ్మ, జమ్మూ నారాయణమ్మలకు నూతనంగా నిర్మించబడుతున్న నాలుగు ఇళ్లకు యూపీవీకి డోర్ ఫ్రేమ్స్, డోర్స్, విండోస్ ఫ్రేమ్స్, విండో డోర్స్, అన్ని ఎలక్ట్రికల్ ఐటమ్స్, పైప్ సెట్స్ అందించారు. ఇంటి నిర్మాణ పని నిమిత్తం 100 బస్తాల సిమెంటును మంత్రి సహకారంతో అందిస్తామని బొత్స ఝాన్సీ లక్ష్మీ బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బెల్లాన వంశీ కృష్ణ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, మండల పార్టీ అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాసరావు, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, అనంత్, గరివిడి జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, మాజీ ఎఎంసి చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపిపి గుడివాడ వెంకట శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బాట విడనాడే ప్రసక్తే లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొండపల్లి

ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎన్ని ఇబ్బందులు ఎదురొచ్చిన సంక్షేమ బాటను విడనాడే ప్రసక్తే లేదని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. బుధవారం గొల్లుపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ ప్రజలు ఆర్థికంగా బలోపేతం అయినప్పడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గొల్లుపాలెంను ప్రత్యేక రెవెన్యూ గ్రామం చేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు తోత్తడి పైడిపునాయుడు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గొల్లుపాలెం రెవెన్యూ గ్రామం అయ్యేందుకు అవసరమైన ప్రతిపాద నలు తయారు చేయాలని తహశీల్దార్ ప్రసాద్ రావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపిడిఒ వైబి.రాజేంద్ర ప్రసాద్, వైస్ ఎంపిపి గొండెల ఈశ్వరరావు, బొండపల్లి, గొట్లాం, రాచకిండాం పిఎసియస్ అద్యక్షులు బివి ప్రభూజి, మహంతి రమణ, గొల్లు సతీష్, ఎపివో బి.కృష్ణవేణి, ఎపిఎం సులోచనా దేవి, ఎఒ మల్లికార్జున రావు, గ్రామ సర్పంచ్ పోతల రమణమ్మ, ఎంపిటిసి గొండెల లక్ష్మి, పాల్గొన్నారు.

**నెల్లిమర్ల:** మండలంలోని సీతారామరాముని పేటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు గ్రామంలో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం చూసి మరో సారి వైసిపికి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, నగరపంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, ఎంపిడిఒ జి. గిరి బాల, పాల్గొన్నారు.

**విజయనగరం టౌన్:** నగరంలోని 49వ డివిజన్ 58వ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, ప్రజాస్పందనలను తెలుసుకుంటూ, స్థానిక సమస్యలపై ఆరా తీస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా వైసీపీ నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తానని మాట ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అందుకు తగ్గట్లుగానే నవరత్నాలను అమలు చేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. నగరంలో ఇప్పటికే రహదారులు, చెరువులు, పార్కులు వంటివి అనేకం అభివృద్ధి దిశగా ఏర్పాట్లు చేసిన ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, కనుగుల రాజా తదితరులు పాల్గొన్నారు. 31 డివిజన్ లోని పద్మావతి నగర్ ఆరవ లైన్ నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో జోనలించార్జి కోలగట్ల కృష్ణారావు, కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు పాల్గొన్నారు.

# ఆదివాసీ మహిళలపై దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మణిపూర్‌లో ఆదీవాసీ మహిళల పై ఉన్మాదుల అత్యాచార దాడులు చేయడం దుర్మార్గమని సిఐటియు జిల్లా కమిటీ కన్వీనర్ కిల్లంపల్లి రామారావు అన్నారు. బుధవారం ఆయన విద్యుత్ హమాలీ కార్మికులతో మాట్లాడుతూ మణిపూర్‌లో మతోన్మాదులు ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం దారుణమైన ఘటన అని మండిపడ్డారు. మణిపూర్‌లో ఖనిజ సంపదను దోచుకోవడానికి బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళల పై దాడులు మతతత్వ అలజడులు రేపుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత గిరిజన మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బిజెపి ప్రభుత్వానికి పాలించే హక్కు లేదని వెంటనే మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి మతోన్మాద చర్యలను అన్ని వర్గాల ప్రజలూ సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణ రావు, కెల్ల గోవింద, మీసాల లెనిన్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రామారావు

**జామి:** కేంద్ర ప్రభుత్వం మణిపూర్ ఘటనపై వెంటనే స్పందించి కేంద్ర బలగాలతో దాడులు దౌర్జన్యాలను అదుపు చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీర్ సింగ్ మౌనంగా ఉండటం సరికాదని దళిత మహాసభ నాయకులు అప్పారావు ఆందోళన వ్యక్తం చేశారు. మణి పూర్ ఘటనలపై స్పందించిన ఆయన కేంద్రం తీరును తప్పుబట్టారు. అప్పారావు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఐదు, ఆరు షెడ్యూల్లో ఆదివాసులకు ప్రత్యేకమైన చట్టాలు ఉన్నప్పటికీ ఆదివాసీ మహిళలపై దాడి చేసిన వారిని గుర్తించి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయలేదన్నారు.

# ‘కార్గిల్ విజయ్ దివస్’ ర్యాలీ

ప్రజాశక్తి- గుర్ల

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ‘కార్గిల్ విజయ్ దివాస్’ కార్యక్రమం నిర్వహించారు. కార్గిల్ యుద్ధ విజయాన్ని గుర్తు చేసుకుంటూ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన జవాన్లను స్మరించుకుంటూ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల నుండి గుర్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ మన జవాన్ల సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ టి. ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

**శృంగవరపుకోట:** కార్గిల్ విజయోత్సవానికి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని పలు కళాశాలలు పాఠశాలలలో బుధవారం ‘కార్గిల్ విజయ్ దివస్’ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రాణత్యాగాలు చేసిన సైనికులకు నివాళులర్పించారు. స్వతంత్ర భారత చరిత్రలో మన సైన్యం ఎంతో వీరోచితంగా పోరాడిన ఘట్టాల్ని అందరూ గుర్తు చేసుకోవాలంటూ పిలుపునిచ్చారు. మండలంలోని సంత గౌరమ్మపేట ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంగారు నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**చీపురుపల్లి:** ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్ ఆవరణంలో ఆశయ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో దేశం కోసం వీర మరణం పొందిన జవాన్లుకు జోహార్లు పలుకుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు. రెడ్డి రమణ మాట్లాడుతూ భారత సరిహద్దుల వద్ద వాస్తవాధీన రేఖను దాటి మనదేశంలోకి అక్రమంగా చొరబడిన పాకిస్థాన్ సైన్యాన్ని సుమారుగా 80 రోజులు పాటు వీరోచిత పోరాటంతో తరిమికొట్టి కొంత మంది వీరమరణం పొందారని గుర్తు చేశారు.

## క్వారీ వల్ల అనారోగ్యం

**కొత్తవలస:** చినరావుపల్లి గ్రామం గుండా వెళుతున్న క్వారీ లారీల వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ బోసాల దేవుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దేవుడు మాట్లాడుతూ చినరావుపల్లి క్వారీలు విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు సంబంధించిన వని ఆవేదన వ్యక్తం చేశారు. కంటకాపల్లి రైల్వే యార్డ్ నుంచి బొగ్గు రవాణా వల్ల కంటకాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం విద్యార్థులు నిత్యం నాన తంటాలు పడుతున్నారని కంటకాపల్లి సర్పంచ్ మదిన అప్పల రామ్ సభలో ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు రవాణా ఆపాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కలిగించాలని కోరారు. చినుకు పడితే చాలు గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేసి గ్రామాల్లో చీకటి చేస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో అంటు వ్యాధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తవలస పిహెచ్‌సి వైద్యులు సీతల్ వర్మ తెలిపారు. ఉపాధి హామీ పథకం నుంచి మండలంలో గుర్తించిన పనులు చేయనున్నట్లు ఎపిఒ జనార్ధన్ తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ దెందేరు పంచాయితీలో నెలకొన్న సమస్యలను పరిస్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఎండిఒ వై. పద్మజ, ఎంపిటిసి మేళాశ్రీ సరస్వతి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ ప్రభావంపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ నాగమణి

చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ ప్రభావంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సంయుక్తంగా ఇంజనీరింగ్ విద్యార్థులపై ర్యాగింగ్ నిర్మూలన, డ్రగ్స్ ప్రభావంపై కళాశాల క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి అండ్ సెక్రటరీ కె నాగ మణి మాట్లాడుతూ విద్యార్థులు పెద్ద కలలు కనాలని, వాటిని చేరుకోవడానికి ప్రయత్నించాలని ఆమె సూచించారు. భవిష్యత్తు మీ ప్రవర్తన, నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ర్యాగింగ్ అనేది మీ శక్తిని చూపించడానికి మాత్రమేనని, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయపడుతున్నారని, క్యాంపస్‌లో సీనియర్లు, జూనియర్లందరూ ఆరోగ్యకరమైన సంబంధాన్ని కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం వేలూరి, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టు కరుణ లత, ఎస్ఐ మహేష్, న్యాయవాది రవిశంకర్, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సీతారామ రాజు, ఎన్ఎస్-ఎస్ పిఒ ఎన్ షణ్ముఖరావు, పాల్గొన్నారు.

**IN THE HONOURABLE COURT OF DISTRICT CONSUMER REDRESSAL COMMISSION AT VISAKHAPATNAM**
**C.C.No. 92 / 2023**
**Between:**
Sri Chattla Murali
. . . Complainant.
**And:**
I.G.K.Electrics., and Others
. . . Opposite Parties
**NOTICE / SUMMONS**
**To**
**OP-2: I.G.K. Electrics,**
Rep. by its Authorized Signatory,
Vanarasi Nagendra, D.No. 3-82,
Velama Street, Kallepalli,
Lakkavarupu Kota,
Vijayanagaram - 535 183.
. . . . Opposite Parties 2
Please take notice that the above case was filed by the complainants against both of you for causing deficiency of service by the opposite parties and the same was stands posted to serve notice to you for your appearance. Both of you, therefore, required to appear either in person or through an advocate on **09-08-2023 at 10-30 A.M.** before the Hon'ble Commission, failing which both of you will be set ex-parte and the matter will be decided in your absence.
(By Order of the Commission)
**Ch.MURALI,** Complainant
S/o. Nagireddy,
D.No. 58-11-140/9, NAD Kotha Road, Visakhapatnam-9

# ఏగిరెడ్డి కృష్ణకు నివాళ్లు

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని ఉద్దవోలు గ్రామంలో ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ మృతికి జెడ్‌పి చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, తదితరులు నివాళులర్పించారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొన్నారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను గారు మాట్లాడుతూ.. కృష్ణ లాంటి మంచి వ్యక్తి మరణించడం చాలా బాధాకరమని తెలిపారు. అంత కిరాతకంగా హతమార్చిన నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చర్యలు చేపడతామని..

కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మావిడి శ్రీకాంత్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు (పెద్దబాబు), మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని తాటిపూడి రిజర్వాయర్ ముతా కాలువలో గుర్తుతెలియని మహిళా మృతదేహం బుధవారం మధ్యాహ్నం బయటపడింది. విషయం తెలుసుకున్న గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు సంఘట స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈమె వయసు 65 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేశారు. మృతురాలి ఆచూకీ తెలియలేదని వీఆర్వో ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### 15తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని గుర్ల గ్రామంలో మంగళవారం రాత్రి కోరాడ పెంటమ్మ ఇంటిలో దొంగతనం జరిగింది. పెంటమ్మ ఇంటిలో ఎవరూ లేకపోవడంతో సుత్తితో బీరువా పగలగొట్టి 15 తులాలు బంగారం, రెండు లక్షలు నగదు అపహరించారు. ఇంటిలో బీరువా తెరిచి వుండడంతో లబోదిబోమంటూ గ్రామస్థులతో చెప్పగా ఆంధ్ర పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో ఆంధ్ర ఎస్ఐ సిద్ధార్థ్ కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం క్లూస్ టీం రంగప్రవేశం చేసింది. గజపతినగరం సిఐ లెంక అప్పలనాయుడు చోరి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.